క్లుప్తంగా

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం పట్టుకున్న అనంతరం విలేకరులతో విజిలెన్స్ సీఐ సింహాచలం మాట్లాడుతూ ముగ్గురు వ్యాపారులు ఇంట్లో 19 బ్యాగులతో ఉన్న బియ్యం విషయమై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గజపతినగరం పౌర సరఫరాల గొడౌన్‌కు అప్పగించినట్లు ఆర్ఐ భానుప్రకాశ్, వీఆర్వో భాను చెప్పారు.

సహస్ర దీపాలంకరణ



సహస్రదీపాలంకరణ చేసి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కుమరాం గ్రామంలోని ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి భక్తులు సహస్రదీపాలంకరణ చేశారు. అలాగే ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ జి.ఎస్.శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న స్నేహ సంస్థ సభ్యులు

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోటలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యూనిఫాం దుస్తులను పంచాయతీ కార్యాలయంలో గురువారం అందజేశారు. స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎ.ఎస్.వెంకటరావు మాట్లాడుతూ 70మంది కార్మికులకు రూ.48వేల విలువైన దుస్తులు పంపిణీ చేశామన్నారు. ఆ సంస్థ కార్యదర్శి మంథా సుబ్బారావు, ఉపాధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, సభ్యులు ఎం.ఎస్.ఎన్.మూర్తి, శ్రీరామ్మూర్తి, వి.ప్రసాద్, డాక్టర్ ఎం.వేణు, ఎం.రామకృష్ణ, కె.శ్రీను, పి.శ్రీరాములు, ఎం.బి.ఎస్.ప్రసాద్, ప్రవీణ్, వి.రాము, పి.దేముడు పాల్గొన్నారు.

గరిష్ట వేతనం అందేలా పనులు చేయించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు

దత్తిరాజేరు: ఉపాధి హామీ వేతనదారులకు ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందేలా వారితో పనులు చేయించే బాధ్యత క్షేత్ర సహాయకులు, మేట్లదేనని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పల నాయుడు అన్నారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఏపీఓ అప్పలనాయుడు అధ్యక్షతన మేట్లకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం,రాయితీలు అందిస్తోందని, వీటిపై రైతులకు అవగాహన కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, టీఏలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

చీపురుపల్లి: వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్‌ను రూ.3వేలకు పెంచిందని, అలజంగి గ్రామంలో లబ్ధిదారులకు శుక్రవారం ఉదయం 8 గంటలకు పింఛన్ డబ్బులను పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

6న గొట్లాంలో ...

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో లబ్ధిదారులకు సామాజిక భద్రత పింఛన్లను ఈనెల 6న పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మాట నిలబెట్టుకున్నాం..

- ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3 వేలకు పెంపు
- పెంచిన పింఛన్ల పంపిణీలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



మెరకముడిదాం: ఉత్తరావల్లిలో వృద్ధుడికి పింఛన్ డబ్బులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: ఎన్నికల సమయంలో అవ్వా, తాతలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పింఛన్ మొత్తాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రూ.3 వేలకు పెంచారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఉత్తరావల్లి, రాచగుమడాం గ్రామాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీని గురువారం ఆయన ప్రారంభించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్లను పంపిణీ చేశారు. రాచగుమడాంలో జెడ్పీ చైర్మన్ పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు. ఉత్తరావల్లిలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ పింఛన్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.2 వేల నుంచి దఫ, దఫాలుగా రూ.3 వేలు కు పెంచారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పింఛన్‌తో పాటు అరకొరగా అమలు చేసిన పథకాలను సైతం ఆ పార్టీ సాను భూతి పరులకు, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చేవారికే మంజూరు చేసే వారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకతీ తంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని, సిఫార్సు లతో పనిలేదని, లంచాలకు తావులేదని అన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపు తట్టి పింఛన్ డబ్బులు అందజేస్తు న్నారని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ విధానం లేదని చెప్పారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ పరిశీలకుడు కె.వి. సూర్యనారాయణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె. ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు, డీఆర్డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, డీపీఓ శ్రీధర్‌రాజా, ఎంపీడీఓ ఎం.రత్నం, తహసీల్దార్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం జగన్

- ఎమ్మెల్యే కడుబండి



జామి: జామిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట/జామి: పేద ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని, పేదల అభ్యున్నతి కోసం ఆయన అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎల్.కోట మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో, జామి మండల కేంద్రంలో నూతన పింఛన్లతో పాటు పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలుకు పెంచారన్నారు. దేశంలో ఏరాష్ట్రంలోనూ ఇంత మొత్తంలో పింఛన్ ఇవ్వడం లేదన్నారు. గత టీడీపీ పాలనలో ఎవరికైనా కొత్తగా పింఛన్ మంజూరు కావాలంటే , అప్పటికే ఆ గ్రామంలో పింఛన్ అందుకుంటున్న వారిలో ఎవరో ఒకరు చనిపోతే కాని మంజూర య్యేది కాదని గుర్తు చేశారు. నేడు అర్హులందరికీ పింఛన్లు, పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండడంతో గ్రామాల్లోకి టీడీపీ నాయకులు వచ్చి మాయ మాటలు చెబుతారని, వారిని నమ్మవద్దని సూచించారు.ఎల్.కోట మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ వై.రూపేష్, ఈఓపీఆర్డీ జ్ఞానేశ్వరరావు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి యడ్ల కిశోర్, వైస్ ఎంపీపీ ఆవాల శ్యామ ల, జామిలోఎంపీడీఓ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ మండల ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, డీసీసీబీ డైరక్టర్ పాండ్రంకి సంజీవి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫి కేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు గుడివాడ రాజేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందు నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పిన్నింటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



లక్కవరపుకోట: లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

దేశానికే ఆదర్శంగా సంక్షేమం



మెంటాడ(గజపతినగరం రూరల్): మరుపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక

మెంటాడ(గజపతినగరం రూరల్): పేదల కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలు స్తున్నాయని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. వైఎస్సార్‌పెన్షన్ కానుకలో భాగంగా పెంచిన పింఛన్లను మరుపల్లి గ్రామంలో లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో నూ అవ్వా, తాతలు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక పింఛన్ రూ.3 వేలు ఇవ్వడం లేదని, మన రాష్ట్రంలోనే రూ.3వేలు అందిస్తున్నారని చెప్పారు. ఈ ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీడీఓ కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: వావిలపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

పండగలా నూతన పింఛన్ల పంపిణీ

వేపాడ: కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో గురువారం పండగ వాతావరణంలో సాగింది. వావిలపా డులో సర్పంచ్ బీల రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎంపీపీ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. నీలకంఠరాజపురం, భర్తవానిపాలెం, జమ్మాదేవిపేటలో డీసీసీబీ చైర్మన్ చిన రామునాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, ఉపసర్పంచ్ కండిపల్లి పెదనాయుడు, చినగుడిపాలలో సర్పంచ్ రామునాయుడు నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.



వేపాడ: నీలకంఠరాజపురంలో పింఛన్లు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

పనితీరు మెరుగుపరుచుకోవాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: గ్రామ సచివాలయ ఉద్యోగులు పనితీరును మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉందని, వారి విధులను ఎంపీడీఓ ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువా రం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే కడుబండి అతిథిగా హాజరయ్యారు. అధికారులు శాఖల వారీగా వివరించిన ప్రగతి నివేదికలపై ఎమ్మెల్యే సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వ హించే సమయంలో వందలాది మంది ఇళ్ల స్థలాలు, ఇళ్లు కావాలని తనని కోరారని తెలిపారు. అయితే ఇప్పుడు 146 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని, సచివాలయ ఉద్యోగులు సక్రమంగా పనిచేయకపోవడ మే దీనికి కారణమని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ధాన్యం విక్రయించుకునే ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు తలెత్త కుం డా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీలు ఆవాల శ్యామల, ఎం.శ్రీనురాజు, ఎంపీడీఓ వై.రూపేష్, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఆక్రమణలు తొలగించేందుకు తీర్మానం

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ ఎస్.కోటలో రోడ్లు ఆక్రమణలకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆక్రమణలు తొలగించేందుకు పంచాయతీ పాలకవర్గం సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. పంచాయతీ ఈఓ కన్నబాబు నేతృత్వంలో, సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇంటిపన్నుల వసూళ్లపై చర్చ జరిగింది. రూ.1,83,02,096 పన్నులు లక్ష్యం కాగా ఇంత వరకూ రూ.18,23,762 మాత్రమే వసూలు అయ్యిందని, షాపింగ్‌కాంప్లెక్స్‌ల నుంచి రూ.10లక్షలు రావాల్సి ఉందని ఈఓ చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆరునెలల వేతనాలు బకాయిలు ఉండడం సరికాదని, ముందుగా వారి వేతనాలు సర్దుబాటు చేయాలని సభ్యులు కోరారు. అక్రమ, అనుమతులకు విరుద్ధంగా చేస్తున్న నిర్మాణాలను గుర్తించి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని సభ్యులకు ఈఓ చెప్పారు. పంచాయతీకి రూ.2 కోట్లు మేర టీడీ రావాల్సి ఉందన్నారు. వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన ఎస్.కోట పంచాయతీ పాలకవర్గం

చీపురుపల్లి ఎస్ఐకు బదిలీ

చీపురుపల్లి: స్థానిక ఎస్ఐ ఏ.సన్యాసినాయుడును విజయనగరం వేకెన్సీ రిజర్వ్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఎం.దీపిక గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో గంట్యాడ ఎస్ఐగా పని చేస్తున్న కె.కె.కె.నాయుడును నియమించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా



బీఎల్ఓలతో సమీక్షిస్తున్న ఈఆర్ఓ సుదర్శనదొర

లక్కవరపుకోట: మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై నియోజకవర్గ ఈఆర్ఓ సుదర్శనదొర బూత్ లెవెల్ అధికారులను(బీఎల్ఓలు) ఆరా తీశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించి శుక్రవారం నాటికి నివేది కలు అందజేయాలని సూచించారు. విధి నిర్వహణ లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఓటర్ల జాబితాకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఈశ్వరరావు

మెరకముడిదాం: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా గేదెల ఈశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన ఆర్.పార్వతి బొబ్బిలి మండలానికి బదిలీపై వెళ్లారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏఈ ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తానన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం-ఆంధ్రా'



గుర్ల : క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, నాయకులు

గుర్ల: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం'ఆడుదాం-ఆంధ్రా' పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తోందని జెడ్పీటీసీ శీర అప్పలనాయు డు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో స్పోర్ట్స్ టీషర్టులు గురువారం అందజేశారు. జేసీఎస్ కన్వీన ర్ బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, ఏఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం: షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఉల్లాసంగా...

గజపతినగరం: మండలంలో 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీలు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వేదికగా గజపతినగరం,పురిటిపెంట గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. జెడ్పీటీసీ గార తవుడు, నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, రేగ సురేష్ ఈపోటీలను ప్రారంభించారు. పీఈటీలు సీహెచ్.సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సాహం

లక్కవరపుకోట: ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగించుకోవాలని ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని వీరభద్రపేట, ఖాసాపేట గ్రామాల్లో రైతులకు రాయితీపై అందజేసిన డ్రిప్,స్పింకర్ల యూనిట్‌లను గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రిప్,స్పింకర్ల ఇరిగేషన్ ద్వారా నీటి ఆదా తో పాటు సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తోందని తెలిపారు. ఆయన వెంట సచివాలయ అగ్రికల్చర్, హార్టీకల్చర్ సహాయకులు ఉన్నారు.



ఖాసాపేటలో స్పింకర్లను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

మౌలిక వసతులు మెరుగుపరుస్తాం

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మక్రివలస సచివాలయం పరిధిలోని గిరిజన గ్రామం శిగడంవలసలో మౌలిక వసతులను ఈనెలాఖరుకు మెరుగుపరుస్తామని జెడ్పీటీసీ గార తవుడు హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బందితో కలిసి ఆ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. తాగునీటి కుళాయిలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని, రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఆయన్ని కోరారు. రోడ్డు మినహా మిగతావన్నీ ఈనెలాఖరు నాటికి ఏర్పాటు చేస్తామని వారికి స్పష్టం చేశారు. రోడ్డు అంశాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి తీసుకువెళ్లి, రెండు మాసాల్లో మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట తుమ్మికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావుతో పాటు మండల నాయకులు ఉన్నారు.



శిగడంవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ తవుడు

నేడు ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

బొండపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా స్థానిక సచివాలయం-1 పరిధిలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరంలో వైద్యులు సేవలందిస్తారని పేర్కొన్నారు. సచివాలయ పరిధి ప్రజలు ఈ సేవలను సద్వినియోగించుకోవాలని సూచించారు.

'నేను, నా పాఠశాల- బృందావనం'

చీపురుపల్లిరూరల్: మండలంలోని పి.కె.పాలవలస పంచాయతీ పరిధి మెట్టబడి, కలిశెట్టిబడి గ్రామాలకు చెందిన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు,గ్రామపెద్దలు 'నేను, నా పాఠశాల- బృందావనం, గ్రంథాలయం' అనే వినూత్న కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనుకునే గ్రామస్తులు తమ కుటుంబాల్లో శుభకార్యాలు జరిగేటప్పుడు పాఠశాలలకు మొక్కలు,గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేయాలని హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు సూచించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ గడి భాస్కరరావు మొక్కలు, పూలకుండీలు వితరణ చేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ బైరెడ్డి పున్నయ్య,వైస్ సర్పంచ్ బైరెడ్డి సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలకు పూలమొక్కలు, కుండీలు అందజేస్తున్న గ్రామస్తులు

తులసీరావుకు ఘనంగా నివాళి

వేపాడ: విజయ విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు వర్ధంతిని బానాదిలో ఆ డెయిరీ సూపర్‌వైజర్ ఎం.నాయుడుబాబు ఆధ్వ ర్యంలో గురువారం నిర్వహించారు. పాల ఉత్పత్తిదారుల సంఘాల కార్యదర్శులు తులసీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశాఖ డెయిరీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి, పాడి రైతులకు అందించిన సేవలను కొనియాడారు.



తులసీరావు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న పాల ఉత్పత్తిదారుల సంఘాల కార్యదర్శులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం: కెంగువ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్‌శాఖ బొబ్బిలి ఏఈ అనంతరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముచ్చర్ల, రంగుపురం, ఎం.కొత్తవలస, వేమలి, కొండపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బ్రెయిలీ లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు

వేపాడ: అంధులు చదువుకునేందుకు లూయిస్ బ్రెయిలీ ప్రత్యేక లిపిని కనిపెట్టి, అంధుల జీవితాల్లో వెలుగులు నింపారని వల్లంపూడి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అర్జునరావు అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పాఠశాలలో గురువారం నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బ్రెయిలీ కనుగొన్న లిపితో ఎంతోమంది అంధులు చదువుకోగలుతున్నారని అన్నారు ప్రత్యేక అవసరాల పిల్లల విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలన్నారు. సహిత విద్య ఉపాధ్యాయినులు ఎస్.సత్యవతి, సీహెచ్ జయంతి, ఎస్.విజయలక్ష్మి తదితరులు సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగులకు అందుతున్న సేవలను వివరించారు.



బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇంటింటికీ అయోధ్య అక్షతలు

శృంగవరపుకోట: అయోధ్య రామజన్మభూమిలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట నేపథ్యంలో భారతీయ జనతాపార్టీ నేతృత్వంలో పంపిణీ చేస్తున్న అయోధ్య అక్షతలు ఎస్.కోట పట్టణానికి చేరాయి. బాలరామునికి పూజలు చేసిన అక్షతలను శ్రీనివాసకాలనీలో బీజేపీ నాయకులు, రామభక్తులు గురువారం పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు డి.సూర్యారావు, డాక్టర్ పి.వరలక్ష్మి, ఎల్.సాంబమూర్తి మాట్లాడుతూ ఇంటింటికీ అయోధ్య అక్షితలు, రామమందిరం ప్రతిష్ట ఆహ్వానపత్రిక, ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. అయోధ్య రామమందిరంలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ట ఈనెల 22న ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



ఎస్.కోటలో అయోధ్య అక్షతలను ఊరేగిస్తున్న బీజేపీ నాయకులు